క్లుప్తంగా

నందీశ్వరుడికి విశేష పూజలు



పూజలందుకున్న నందీశ్వరుడు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారంలో కొలువైన గంగ, ఉమాసమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి శనివారం ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి గర్భాలయం ముందున్న నందీశ్వరుడికి సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకం, గంధం, పాలతో అభిషేకం చేశారు. మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పైపు లీకేజీలకు మరమ్మతులు

మహానంది: మండలంలోని గాజులపల్లె జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా ఉన్న తాగునీటి ట్యాంకు వద్ద పైపులైన్ లీకేజీకి పంచాయతీ సిబ్బంది శనివారం మరమ్మతులు చేశారు. నీరు వృథాగా వెళ్తున్న విషయంపై సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'సారూ...నీటి వృథాను అరికట్టండి' శీర్షికతో ప్రచురించిన వార్తకు పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్ మొహమ్మద్ స్పందించారు. ఈ మేరకు మరమ్మతులు చేపట్టి లీకేజీలను అరికట్టారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూత



గిరిజనులతో మాట్లాడుతున్న పీడీ

మహానంది: నంద్యాల జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తున్నట్లు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి తెలిపారు. మహానంది సమీపంలోని చెంచులక్ష్మీ గూడెంలో గిరిజనులు చేపడుతున్న పండ్లతోటల పెంపకాన్ని శనివారం ఆయన పరిశీలించారు. గిరిజనులకు పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. నంద్యాల జిల్లాలో ఆసక్తి ఉన్న రైతులకు పొలం గట్ల వెంట పెంచుకునేందుకు కొబ్బరి, మామిడి, తదితర మొక్కలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఏపీఓ మనోహర్ ఉన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరేష్ చేతుల మీదుగా పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి ఉచిత పుస్తకాలను పేద విద్యార్థులకు అందించడంతోపాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు సలీం, అబ్దుల్‌జబ్బార్, నాగవేంద్ర, జయకృష్ణ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై విజయవాడకు చెందిన జె.రామచంద్ర మూర్తి బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. మహాగణపతి, శివ శివ శంకరా, నమఃశివాయతే, భో శంభో తాండవ నృత్యం, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు పి.ఆర్.మురళీకృష్ణ, లాస్యశ్రీ, ధృతి, రూపేక్ష, భవజ్ఞ, రేవంతి, వెంకటేశ్వర్లు, షణ్ముఖి తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

ఘర్షణ కేసులో నలుగురికి రిమాండ్

మహానంది: మహానందిలోని ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు బంగి వెంకటేశ్వర్లు, బంగి రమేష్‌లపై దాడి చేసిన కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు దాడికి పాల్పడిన వారిలో శ్యామ్, శ్రీకాంత్, సుంకన్న, మహేష్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

వీబీఆర్‌లో 8 టీఎంసీల నీరు

వెలుగోడు: తెలుగు గంగ అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. శనివారం వీబీఆర్‌లో 8.615 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ మీదుగా వీబీఆర్‌లోకి 17150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా మద్రాస్ కాల్వకు 16 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వన్ ఎల్ ద్వారా 30 క్యూసెక్కులు, వన్ ఆర్ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వీబీఆర్ పూర్తి సామర్థ్యం 16.32 టీఎంసీలు కాగా వీబీఆర్‌లోకి 8 టీఎంసీలు రావడంతో సగం రిజర్వాయర్ నిండినట్లు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్నేహమేరా జీవితం



ప్రపంచంలోని అత్యంత అందమైన సంబంధాల్లో స్నేహం ఒకటి. పాఠశాల స్థాయి నుంచే మన కష్టాలు, సంతోషాలను పంచుకునేవాడు స్నేహితుడు. మనకు మంచి చెడులను చెప్పేవారు మన స్నేహితులు కాక ఇంకెవ్వరు. అందుకే ప్రతి ఒక్కరి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్నేహితులదే ప్రత్యేకమైన స్థానం. అంతటి గొప్ప బంధాన్ని వేడుక చేసుకోవడానికి ఏటా ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా పలువురు తమ స్నేహితులతో తమ అనుబంధాన్ని పంచుకున్నారు. వారి మాటల్లోనే..

–ఆత్మకూరు

20 ఏళ్ల స్నేహబంధం



నా పేరు శర్వ మనోహర్‌రెడ్డి, నా మిత్రుడు శివకుమార్ రెడ్డి. మేమిద్దరం ఇరవై ఏళ్లుగా స్నేహితులుగా ఉన్నాం. వ్యాపారాల్లో రాణిస్తున్నాం. నంద్యాల పట్టణంలో బేకరీ, బాటా షూ కంపెనీ షాపును నిర్వహిస్తున్నాం. ఏదైనా సంఘటన జరిగినా ఒకరినొకరు అండగా ఉంటుంటున్నాం. మేము, నా స్నేహితుడు టూర్‌కు వెళ్తున్నాం. 20 ఏళ్లుగా ఒక్కసారి కూడా ఇబ్బంది పడిన ఘటనలు లేవు. ఏ ఇబ్బందులు ఉన్నా చెప్పుకుంటూ ముందుకు సాగుతున్నాం. భగవంతుడి దయ వల్ల మంచి స్నేహం ఆనందంగా ఉన్నాం. ఇలాగే మా స్నేహం కొనసాగాలని దేవుడిని కోరుకుంటున్నా.

–శర్వ మనోహర్‌రెడ్డి, అబ్బీపురం, మహానంది మండలం

చిన్నప్పటి నుంచి స్నేహితులం



మాది ఆత్మకూరు మండలం ఎస్.ఎన్.తండా. మాది చిన్నతండా గ్రామం. నా మిత్రులు శివశంకర్‌నాయక్, బాలరాజునాయక్, మహేంద్రనాయక్‌లతో పాటు నలుగురు స్నేహితులం. చిన్నప్పటి నుంచి స్నేహితులం. 20 ఏళ్లుగా కలిసిమెలిసి పొలం పనుల్లో పాలుపంచుకుంటున్నాం. కూలీలు, వ్యవసాయ పనులకు ఒకరినొకరు సాయం చేసుకుంటాం. వరి, మొక్కజొన్న పంటలను సాగుచేస్తాం. ఏ అవసరం, ఆపద వచ్చినా సాయం అందించుకుంటూ స్నేహానికి విలువనిస్తూ ముందుకెళ్తున్నాం. ఒకరినొకరు అండగా ఉంటూ అనురాగంతో ఉంటున్నాం.

–వెంకటేశ్వర్ నాయక్, ఎస్.ఎన్‌తండా, ఆత్మకూరు మండలం

పాఠశాల స్థాయి నుంచే ముగ్గురిది ఒకటే దారి



చదువుకున్న రోజుల నుంచి ఇప్పటి వరకు విడదీయరాని స్నేహ బంధం మాది. మేమంతా చిన్నప్పటి నుంచి ఒకే తరగతి, ఒకే కళాశాలలో చదువుకున్నాం. నేను, రాజశేఖర్, సముద్రాల సుబ్రహ్మణ్యం ఆళ్లగడ్డలో చిన్నప్పటి నుంచి 6వ తరగతి మొదలుకుని పది, ఇంటర్ వరకు ఒకే పాఠశాల, కళాశాలలో చదువుకున్నాం. ముగ్గురం వ్యాపారాల్లో స్థిరపడ్డాం. నేను మొబైల్ షాపు నిర్వహిస్తున్నాను. సముద్రాల సుబ్రహ్మణ్యం కర్నూలులో జనరల్ స్టోర్ నడుపుతూ జీవిస్తున్నాడు. రాజశేఖర్ కోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. ముగ్గురం ఇప్పటికీ మా బంధాన్ని కొనసాగిస్తున్నాం. నేపాల్, ఖాట్మాండు, భూటాన్‌తో పాటు రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, అన్నవరం, ద్రాక్షారామంతో పాటు పలు పుణ్యక్షేత్రాలు తిరిగాం. ముగ్గురు స్నేహితులతో అందరూ కుటుంబ సభ్యులుగా కలిసి వెళ్తాం. ఎలాంటి అనారోగ్యాలు వచ్చినా, ఆర్థిక ఇబ్బందులు వచ్చినా ఆర్థికంగా ఒకరికొకరు తోడుగా ఉంటున్నాం.

–కొప్పురపు రవిప్రసాద్, ఆత్మకూరు

బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు



వీరభద్రస్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర పాలకుడైన బయలు వీరభద్ర స్వామికి శనివారం అమావాస్య ఘడియలు రావడంతో విశేషార్చన జరిపించారు. అమ వాస్య రోజున భక్తులు పరోక్ష సేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం కల్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి 17 మంది భక్తులు పరోక్ష సేవ ద్వారా ఈ విశేష పూజను జరిపించుకున్నారు. ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణ పతి పూజ జరిపారు. అనంతరం పంచామృతాలు, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ పూజలతో గ్రహదోషాలు తొలగిపోతాయని, అభీష్టాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో పట్టు కోసం పాట్లు

- ఓటరు జాబితా ప్రకటించిన ఉపాధ్యాయులు
- లిస్ట్ కోసం ప్రధానోపాధ్యాయులపై అధికార పార్టీలోని ఇరువర్గాలు ఒత్తిడి



పగిద్యాల ఆదర్శపాఠశాల నోటీస్ బోర్డులో తల్లిదండ్రుల జాబితా ప్రచురించిన ప్రిన్సిపాల్ సుజన

పగిద్యాల: ఈనెల 8న జరిగే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో పట్టు కోసం అధికార పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య (మాండ్ర) వర్గీయులు పోటీ పడుతున్నారు. ఇప్పటికే మాండ్ర వర్గీయులు విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను సేకరించే పనిలో పడగా తాము తక్కువేమి కాదన్నట్లు బైరెడ్డి వర్గీయులు కూడా అందులో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అధికార పార్టీ నాయకులు ఫోన్ చేసి జాబితా ఇవ్వాలని ఒత్తిళ్లు చేసినట్లు సమాచారం. అయితే, ఓటర్ల జాబితా ఎవరి చేతికి ఇవ్వరాదని మండల విద్యాధికారి సుభాన్ ప్రధానోపాధ్యాయులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. కేవలం నోటీస్ బోర్డుల్లో ప్రచురించిన జాబితాను ఫొటో తీసుకునేందుకు అనుమతించండని చెప్పడంతో ఇరు వర్గాల నాయకులు పాఠశాలల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికార పార్టీ నుంచి రెండు వర్గాలు తమకు అనుకూలమైన విద్యార్థుల తల్లిదండ్రులను పోటీలో నిలిపి కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా గెలిపించుకునేందుకు పావులు కదుపుతున్నారు. కాగా ఈ ఎన్నికల్లో 3,289 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనే అవకాశం ఉంది.

పామాయిల్ సాగు లాభసాటి



పామాయిల్ మొక్కలు నాటుతున్న నంద్యాల జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు

మిడుతూరు: పామాయిల్ సాగు రైతులకు లాభసాటి అని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామంలో అయిల్ పామ్ సాగును సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు డివిజన్‌లో త్రి ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీకి ఎంపిక చేయడం జరిగిందని,ఈ డివిజన్‌లో 50 హెక్టార్లు ఆయిల్ పామ్ సాగు చేశారని చెప్పారు. రైతులకు ఒక హెక్టార్‌కు రూ. 29 వేల చొప్పున మూడు సంవత్సరాల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉద్యాన అంతర సంటలు సాగు చేసేందుకు ఒక హెక్టార్‌కు రూ. 5,500 అందిస్తామని చెప్పారు. ఆసక్తి గల రైతులు ఉద్యాన అధికారులు, రైతు సేవా కేంద్రాలు, త్రీ ఎఫ్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి తేజస్విణి, వీహెచ్‌ఏ ప్రత్యూష, ఎంపీఈఓ కిశోర్, హెచ్‌ఈఓ సురేష్, జోనల్ అధికారి వెంకటప్రసాదు, ఏరియా మేనేజర్ నాగరాజు , రైతులు పాల్గొన్నారు.

పంట నమోదుతో రైతులకు ప్రయోజనం

కొత్తపల్లి: ప్రతి రైతు సాగుచేసిన పంటలను నమోదు చేయించుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ సూచించారు. మండలంలోని ఎదురుపాడు, గోకవరం గ్రామాల్లో ఈ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మహేష్ ఆధ్వర్యంలో విత్తన, పురుగు మందుల, ఎరువుల డీలర్లతో సమావేశమయ్యారు. అనంతరం ఏడీఏ రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి పంటనమోదు చేయించు కొనేలా చూడాలన్నారు. పంటనమోదు ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతాయన్నారు. అలాగే ప్రతి దుకాణదారుడు రైతులకు అనుమతులు లేని రసాయన ఎరువులు, మందులు విక్రయించరాదన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్స్ అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. స్టాక్ రిపోర్ట్ ప్రతినెల మూడో తేదీ లోపు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

25 వేల క్యూసెక్కుల నీరు విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి 25 వేల క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేసినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. శ్రీశైలం వెనుక జలాలను పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి ఎస్‌ఆర్‌ఎంసీ ద్వారా 25 వేల క్యూసెక్కుల నీరు బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు వచ్చి చేరుతుందన్నారు. ఈ నీటిలో తెలుగుగంగ(వీబీఆర్)కు 15,000 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్‌కు 9,000 క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 1000 క్యూసెక్కుల చొప్పున గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి



మిడుతూరులో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మిడుతూరు: మండలంలోని కౌలు రైతులందరికీ కౌలు కార్డులు మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఏపీ కౌలుదార్ల సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రం మిడుతూరు వ్యవసాయ కార్యాలయం, దేవనూరు గ్రామ సచివాలయంలో కౌలురైతుల సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు కౌలు రైతులు బయట అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. భూ యజమానికి సంబంధం లేకుండా 2011 కౌలు దారుల చట్టం కింద అగ్రిమెంట్ పైన కౌలు రైతులకు గుర్తింపుకార్డు ఇవ్వాలని, అలాగే సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, బ్యాంకు నుంచి రూ. 2 లక్షల వరకు రుణ సాయం చేయాలన్నారు. వెంటనే అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగరాజు, నాగశేషులు, సోమన్న, రామకృష్ణ, వెంకటస్వామి, నాగేంద్ర, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంకు పోటెత్తిన సందర్శకులు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు



డ్యాం మార్గంలో నిలిచిపోయిన వాహనాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం గేట్లు తెరవడంతో చూసేందుకు సందర్శకులు పోటెత్తడంతో ఆ సరిసర ప్రాంతాల్లో శనివారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో శనివారం వందలాది వాహనాల్లో భక్తులు, యాత్రికులు శ్రీశైలం చేరుకున్నారు. డ్యాం 10 రేడియల్ క్రస్ట్ గేట్లు తెరవడంతో కృష్ణానది సొబగులు చూడడానికి సందర్శకులు డ్యాం పరిసరాల్లో వాహనాలు నిలిపి ఫొటోలు దిగారు. దీంతో ట్రాఫిక్ జాం అయ్యింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఆ ప్రాంతంలో పోలీసులు లేకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి శ్రీశైలం చేరుకునే భక్తులు ఇబ్బందులు పడ్డారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటరీ వర్కర్ల (ఆయాలు) పెండింగ్ వేతనాలు చెల్లించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు జవహర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆత్మకూరు పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ శానిటరీ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి గౌరవ భృతి రూ.6 వేలు చెల్లిస్తున్నారని, కొన్ని జిల్లాల్లో ఆరు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పాఠశాలల్లో కీలకమైన పారిశుద్ధ్య పనులు చేస్తున్న ఆయాలు జీతాల కోసం ఎదురు చూస్తున్నారని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని వారికి జీతాలు అందించేలా చూడాలని కోరారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



మోటారును స్విచ్‌ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: రైతుల సంక్షేమమే ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని తాటిపాడు గ్రామ సమీపంలో జూపాడుబంగ్లా–2 లిఫ్ట ఇరిగేషన్‌లో ఓ మోటారును ఆన్‌చేసి నీటి విడుదలను ప్రారంభించారు. అనంతరం డీఈ నాగార్జునరావు, ఏఈలు నారాయణరెడ్డి, సాంబశివుడుతో కలిసి కృష్ణమ్మకు వాయనం సమర్పించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో శ్రీశైలం డ్యాం నిండిందన్నారు. స్థానిక ఎత్తిపోతల పథకాలు, కాల్వల ద్వారా పంటపొలాలకు సాగునీటిని పారించుకునే అవకాశం లభించిందన్నారు. జూపాడుబంగ్లా 1, 2 ఎత్తిపోతల పథకాల్లో ఐదు మోటార్లు ఉండగా ఐదు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. పంటలు ఎండిపోతుండటంతో తాత్కాలికంగా ఓ మోటార్‌కు మరమ్మతులు చేసి నీటి విడుదల చేపట్టినట్లు వెల్లడించారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

నందికొట్కూరు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రెండు కొత్త బస్సులను ప్రారంభించారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలను క్షేమంగా గమ్యానికి చేర్చుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన



వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మాలమహానాడు తాలుకా అధ్యక్షుడు నగేష్, నాయకులు డాక్టర్ రాజు అన్నారు. శనివారం పట్టణంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై మాలమహానాడు కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా పటేల్ సెంటర్ వరకు ఎస్సీ వర్గీకరణ తక్షణమే రద్దు చేయాలంటూ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. చంద్రబాబు, నరేంద్రమోదీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలలను అణచివేసే కుట్ర జరుగుతుందన్నారు. ఓబీసీల్లో కూడా చాలా వెనుకబడిన కులాలు ఉన్నాయని, మరి వర్గీకరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మాలమాదిగలు కలిసి ఉంటే తమ రాజ్యాధికారానికి ముప్పు అని పాలకులు విడగొడుతున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టులో 9 మందితో కూడిన ధర్మాసనాన్ని ఆశ్రయిస్తామన్నారు. తెలుగు దేశం పార్టీకి, బీజేపీకి భవిష్యత్తులో పుట్టగతుల్లుండవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అబ్రహాం, దేవన్న, మనోహర్, దాసు, ఉదయ్, రాజన్న, రమణ, కృపాకర్, వెంకటస్వామి, ప్రసాద్, పార్థుడు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

80 బన్నూరు ఫీల్డ్‌అసిస్టెంట్ రాజీనామా

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్యాంబాబు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు ఏపీఓ గౌరీబాయి తెలిపారు. గత నెల 20న జరిగిన సోషల్ ఆడిట్‌లో తనిఖీ బృందం గ్రామంలో విచారణ చేపట్టి ఉపాధి పనుల్లో అవకతవకలున్నట్లు పీడీ రామచంద్రారెడ్డి ఎదుట వెల్లడించారు. దీంతో ఫీల్డ్‌అసిస్టెంటు శ్యాంబాబుకు రూ. 29,638 రికవరీ, రూ.1,500 పెనాల్టీ విధించారు. అలాగే గ్రామానికి చెందిన 20 మంది శ్యాంబాబుపై పలు ఫిర్యాదులు చేశారు. దీనిపై శనివారం విచారణ జరగాల్సి ఉండగా విధులకు రాజీనామా చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా తెలియజేసినట్లు తెలిపారు. రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ నూర్జహాన్ ద్వారా పీడీ రామచంద్రారెడ్డికి పంపనున్నట్లు ఏపీఓ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

జూపాడుబంగ్లా: మండలంలోని భాస్కరాపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటు నరసింహ పై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్ శనివారం విచారణ చేపట్టారు. 20 మంది పేర్లపై తమకు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై గ్రామంలో చేపట్టిన విచారణలో వెల్లడైన వివరాలను జిల్లా పీడీ రామచంద్రారెడ్డికి అందజేయనున్నట్లు తెలిపారు.

బాలిక ఆచూకీ కనిపెట్టడంలో సర్కారు విఫలం



వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పులికొండ

నందికొట్కూరు: ముచ్చుమర్రి బాలిక మిస్సింగ్ కేసును ఛేదించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పులికొండ అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 రోజులు గడిచినా బాలిక ఆనవాళ్లు కనిపెట్టలేకపోయిందన్నారు. రాష్ట్రానికి హోంమంత్రిగా మహిళ ఉండి ప్రయోజనం లేదన్నారు. బాలిక కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 5 ఎకరాల భూమి ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాలిక మృత దేహం గాలింపు చర్యలను నిలిపేసినట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజిత మాట్లాడుతూ బాలిక ఆచూకీ కనిపెట్టకపోతే పార్లమెంట్ ముట్టడిస్తామన్నారు. అత్యాచారం చేసి బాలిక మృత దేహాన్ని మాయం చేసిన వారి కుటుంబ సభ్యులను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, సీనియర్ న్యాయవాది వెంకటరాముడు, సీపీఎం నాయకులు ఫక్కీర్ సాహెబ్, గోపాల్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆహారం

కొత్తపల్లి: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆహారమని ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లి అన్నారు. మండలంలో జానాల గూడెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం అన్నారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు తాపితే వ్యాక్సిన్‌గా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు జబీర్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎం శాంతమ్మ, స్కూల్ టీచర్లు, అంగన్‌వాడీ టీచర్ భాగ్యమ్మ, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మిడుతూరు: పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుకాదేవి అన్నారు. శనివారం మండలకేంద్రం మిడుతూరులో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముర్రుపాలు శిశువుకు తొలి టీకా లాంటిదని చెప్పారు. అనంతరం బేటీ బచావో.. బేటీ పడావో బాలసభ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు శారద, తిరుపతమ్మ, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పిల్లలకు డబ్బాపాలు తాపించరాదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావనిరెడ్డి, విలేజ్ సీహెచ్‌ఓ అనూష తెలిపారు. శనివారం జూపాడు బంగ్లాలోని కాసానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగనిరోధక శక్తి

మహానంది: తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తిమ్మాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి అన్నారు. బొల్లవరం, తమ్మడపల్లె గ్రామాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాలే బిడ్డలకు శ్రేయస్కరం అని తెలిపారు. బండిఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామంలో ఎంఎల్‌హెచ్‌పీ శృతి, ఏఎన్‌ఎం వనజ, ఎంఎస్‌కే తాజూన్, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన కల్పించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ఆత్మకూరు: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని బైర్లూటీ వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం వైద్య ఆరోగ్యశాఖ మరియు స్త్రీ, శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా ముష్టపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించాయి. బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, రోగనిరోధకశక్తిని కలిగి ఉంటాయని పేర్కొన్నారు. శిశువు జన్మించిన అర గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. టీబీ సూపర్‌వైజర్ కేపీ మస్తానయ్య మాట్లాడుతూ.. బిడ్డకు క్షయవ్యాధి సోకకుండా తప్పనిసరిగా బీసీజీ టీకాను 24 గంటల్లోపు వేయించాలన్నారు. బైర్లూటీ సీహెచ్‌ఓ అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, ఇంద్ర, ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడు



తీవ్రంగా గాయపడిన ద్విచక్రవాహనదారుడు మల్లికార్జున

జూపాడుబంగ్లా: మద్యం మత్తులో ద్విచక్రవాహనదారుడు ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. జూపాడు బంగ్లా పోలీసుస్టేషన్ ఏఎస్‌ఐ మేరీజయంతి తెలిపిన వివరాల మేరకు...పి.లింగాపురం గ్రామానికి చెందిన మల్లికార్జున మద్యం తాగి బైక్‌పై నందికొట్కూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మండ్లెం పుల్లయ్యబావి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో మల్లికార్జున తీవ్రంగా గాయపడగా తర్తూరు నుంచి నందికొట్కూరుకు ఆటోలో వెళ్తున్న ఆటోడ్రైవర్ దాదెపోగు ప్రసాద్, షేక్‌మున్ని, షేక్‌మైమూన్లతో పాటు 8మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ మేరీజయంతి సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. ఆటో, బైక్‌ను స్టేషన్‌కు తరలించారు.